# టోల్‌గేట్ వద్ద అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట ఎప్పుడు?





- భారీ వాహనాల పార్కింగ్‌తో ప్రమాదం
- రాత్రివేళల్లో ప్రాణహాని ముప్పు
- పట్టించుకోని పోలీస్ శాఖపై ఆరోపణలు

**గుమ్మడిదల, మార్చి 20 (సిరి న్యూస్):**

పురపాలక సంఘం పరిధిలోని జాతీయ రహదారి 765 డి వద్ద గుమ్మడిదల టోల్‌గేట్ సమీపంలో భారీ వాహనాల అక్రమ పార్కింగ్ ప్రమాదాలకు కారణమవుతోంది. రోడ్డుకు ఇరువైపులా, మధ్యలో కూడా ఇష్టారాజ్యంగా వాహనాలు నిలిపివేయడం వల్ల ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రత్యేకంగా భారీ లారీలు, ఇనుప సామగ్రి తీసుకెళ్లే వాహనాలు రహదారి పక్కన నిలిపివేయడంతో ఎదురు వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రి సమయంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. వాహనం దగ్గరకు చేరేవరకు పార్క్ చేసిన వాహనాలు కనిపించకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టోల్‌గేట్ వద్ద ఈ విధంగా వాహనాలు నిలిపివేయడానికి ఎవరైనా అనుమతి ఇచ్చారా? లేక డ్రైవర్లు స్వేచ్ఛగా పార్కింగ్ చేస్తున్నారా? అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా టోల్‌గేట్ యాజమాన్యానికి పార్కింగ్ చార్జీలు చెల్లిస్తున్నారా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో పోలీస్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తరచుగా వాహనాలు నిలిపివేస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి టోల్‌గేట్ వద్ద అక్రమంగా పార్కింగ్ చేస్తున్న వాహనాలను తొలగించి, ప్రమాదాలను నివారించాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.



# ఆశా వర్కర్ల ర్యాలీ ధర్నా



**తూప్రాన్ మార్చ్ 20 సిరి న్యూస్**

తూప్రాన్ మనోహరాబాద్ మండలాలకు చెందిన ఆశా వర్కర్లు శుక్రవారం రోజు తూప్రాన్ లో ఆశా వర్కర్లు సమస్యల పరిష్కారం కోసం ర్యాలీ ధర్నా నిర్వహించారు తూప్రాన్ బస్టాండ్ నుండి మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించి ఆశ వర్కర్లు మాట్లాడుతూ కనీస వేతనం ఇవ్వడం లేదని గత రెండు నెలలుగా వేతనాలు రావడం లేదని వెంటనే ప్రభుత్వం స్పందించి జీతాలు విడుదల చేయాలని కోరారు అలాగే ఉద్యోగ భద్రత పెన్షన్ కల్పించాలని వారు కోరారు ఏ. యం . సి. టీబి టార్గెట్ లో తొలిగించాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం అడగకుండానే రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 12,000 పెంచుతున్నట్లు హామీ ఇచ్చారని ఇప్పటి వరకు అమలు జరగలేదని మండిపడ్డారు ఈ కార్యక్రమంలో శారద భూలక్ష్మి స్వప్న జయలక్ష్మి వరలక్ష్మి కవిత ఆశా వర్కర్లు పాల్గొన్నారు

# రంజాన్ పండుగకు శుభాకాంక్షలు తెలిపిన షఫీఉద్దీన్

**మునిపల్లి, మార్చి 20 (సిరి న్యూస్):**



పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా మునిపల్లి మండల ప్రజలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షఫీఉద్దీన్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.నెల రోజులపాటు ఉపవాస దీక్షలు, దైవభక్తితో కొనసాగిన రంజాన్ మాసం ముగిసిన సందర్భంగా ఈద్–ఉల్–ఫితర్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలను నింపాలని ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాసాలు, ప్రత్యేక ప్రార్థనలు ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. రంజాన్ పండుగ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సామరస్యాన్ని పెంపొందించే పండుగగా నిలుస్తుందని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# కళాజాతతో గ్రామంలో పరిశుభ్రతపై చైతన్యం



- పరిశుభ్రతపై మంబాపూర్‌లో అవగాహన
- డ్రగ్స్‌కు నో చెప్పండి

**గుమ్మడిదల, మార్చి 20 (సిరి న్యూస్):**

డ్రగ్స్ వ్యసనాల దుష్పరిణామాలు, మూఢనమ్మకాల నిర్మూలన, పచ్చదనం మరియు పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజలను చైతన్యపరిచారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై జాగ్రత్తగా ఉండాలని కళాజాత రూపంలో సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి విజయలక్ష్మి పర్యవేక్షణలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు గుమ్మడిదల మండలం మంబాపూర్ గ్రామంలో కళాజాత కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు పాటలు, నృత్యాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు. ముఖ్యంగా విద్య ప్రాముఖ్యత, చదువు ద్వారా సమాజంలో గౌరవం, మంచి స్థానం పొందవచ్చని వివరించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. దోమల నివారణ కోసం దోమతెరలు వాడాలని, బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలకాలని కోరారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, హెపటైటిస్ వంటి వ్యాధులు రాకుండా ఉండాలంటే పరిశుభ్రత అత్యంత అవసరమని అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సాంస్కృతిక సారథి కళాకారులు ఎ. సునీల్ కుమార్, డి. రమేష్, ఎస్. మల్లేష్, జి. బిక్షపతి, ఎన్. రవిందర్, పి. సంధ్య పాల్గొన్నారు.

# రంజాన్ పండుగ సందర్భంగా తనిఖీలు

**తూప్రాన్ మార్చు 20 సిరి న్యూస్**




తూప్రాన్ మున్సిపల్ పట్టణ పరిధిలోని ఈద్గాహ్ ల వద్ద రంజాన్ పండుగ సందర్భంగా ప్రజల భద్రత దృష్ట్యా శుక్రవారం రోజు తూప్రాన్ పట్టణంలోని ఈద్గాహ్ ప్రాంగణాన్ని పోలీసు సిబ్బంది బాంబ్ డిస్పోజల్ టీమ్‌తో కలిసి సమగ్రంగా తనిఖీ నిర్వహించారుతనిఖీ సమయంలో ఈద్గాహ్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి భద్రతా పరమైన చర్యలు తీసుకోవడ జరిగింది పండుగ రోజున కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండేలా సంబంధిత సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగింది పండుగను శాంతియుతంగా జరుపుకోవడానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గుర్తించినట్లయితే వెంటనే తూప్రాన్ పోలీసువారికి లేదా 100 నెంబర్ కు సమాచారం అందించాలని తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపారు కార్యక్రమంలో ఎస్ఐ 2 జ్యోతి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# 4వ వార్డ్‌లో నూతన వాటర్ ట్యాంక్ ప్రారంభం



**మునిపల్లి, మార్చి 20 (సిరి న్యూస్):**

మునిపల్లి గ్రామంలోని 4వ వార్డ్‌లో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించిన గ్రామ సర్పంచ్ రాజగోని సౌందర్య నరేందర్ గౌడ్.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా చేయడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో తాగునీటి కొరతను దృష్టిలో పెట్టుకుని ఈ ట్యాంక్ నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. దీనివల్ల 4వ వార్డ్ పరిధిలోని ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందుతుందని తెలిపారు.గ్రామాభివృద్ధిలో భాగంగా మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు రాజు పటేల్, ఇందూరి పండు, జగదీశ్వర్, చారి, కొనాపురం బస్వారాజు, సుకుమార్, సుభాష్, శాంతయ్య, సిద్ధూల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా వేముల కృష్ణ



**(సిరి న్యూస్) బెల్లంపల్లి:** జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా కాసిపేట మండలంలోని సోమగూడెం గ్రామానికి చెందిన వేముల కృష్ణను నియమితులయ్యారు. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా కృషి చేస్తూ, దశల వారీగా పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వేముల కృష్ణ పనితనాన్ని గుర్తించి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమానికి కృషి చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మాజీ డీసీసీ అధ్యక్షులు సురేఖమ్మ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా పార్టీ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డిలకు, ఆదాని సిమెంట్ కంపెనీ కార్మిక యూనియన్ అధ్యక్షుడు సత్యపాల్ రావులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా, ప్రభుత్వ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి ముందుకు సాగుతామని చెప్పారు.

# హత్య కేసులో ఆరుగురు నిందితుల అరెస్ట్



**(సిరి న్యూస్) జైనూర్:** జిల్లా జైనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన అర్జున్ హత్య కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడు అర్జున్‌తో పాటు నిందితులు రోజువారీ కూలీ పనులు చేసేవారు. ఈనెల 15న పనులు ముగిసిన అనంతరం కలిసి మద్యం సేవించిన సమయంలో డబ్బు విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ప్రధాన నిందితుడు మేస్రాం లక్ష్మణ్ సిమెంట్ ఇటుకతో అర్జున్ తలపై దాడి చేయగా, అతను తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయాడు. అనంతరం కుమ్ర రాము మృతుడి పురుషాంగాన్ని కోసినట్లు విచారణలో తేలిందన్నారు. మిగతా నిందితులు కూడా కట్టెలతో దాడి చేసినట్లు, మరో నిందితుడు దారుణంగా దాడికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, ఈనెల 19న ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ పర్యవేక్షణలో నిందితులు మేస్రామ్ లక్ష్మణ్, కుమ్ర రాము, మేస్రామ్ జంగు, కుమ్ర శ్యాంరావు, కరడే సుభాష్, సుర్పం నితీష్లను అరెస్ట్ చేశారు.

# గేట్ పరీక్షలో 45వ ర్యాంకు సాధించిన రామ్ చరణ్

**సిరి న్యూస్‌టుడే, కర్నూల్ బ్యూరో :**

ఇటీవల జాతీయస్థాయిలో నిర్వహించిన గేట్ పరీక్షలో కర్నూలు జిల్లా, గూడూరు నగరానికి చెందిన ఎరుకల చెరువు బోయ రామచంద్రుడు, లక్ష్మీ నరసమ్మ తనయుడు రామ్ చరణ్ జాతీయస్థాయిలో 45వ ర్యాంకు దక్కించుకున్నారు . గూడూరు నగరంలోని జ్యోతి హై స్కూల్ లో చదువుకున్న రాంచరణ్ 2020 సంవత్సరంలో సంభవించిన

కరోనా సమయంలో పదో తరగతి పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు. ఆ తర్వాత నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ లో డిప్లమా చేశారు. అనంతరం కర్నూల్లోని పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తిచేసి, ఇటీవల నిర్వహించిన గేట్ పరీక్షలో 45 వ ర్యాంకు సాధించారు. తన విజయానికి గల కారణాలను రామ్ చరణ్ వివరిస్తూ, కర్నూల్ నగరంలోని బిర్లా కాంపౌండ్ సమీపంలో తన గురువు అబ్దుల్ అజీజ్ ఏర్పాటు చేసిన ఆల్ ఇక్రా స్మార్ట్ అకాడమీలో శిక్షణ పొందినట్లు తెలిపారు. అకాడమిలో సుమారు 20 మంది విద్యార్థులు శిక్షణ పొందగా ,అందులో ఆరు మంది జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. మోహన్ 89 వ ర్యాంకు సాధించగా ,భరత్ 398వ ర్యాంకు ,వేణు 424 ర్యాంకు, సురేంద్ర 437 వ ర్యాంకు ,సుమంత్ 11 10 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. తన విజయానికి తన తల్లిదండ్రులు, గురువులు, బంధువుల ప్రోత్సాహమే ప్రధాన కారణమని ,జాతీయస్థాయిలో 45 ర్యాంకు సాధించిన రామ్ చరణ్ తెలిపారు .తన ర్యాంకుకు జాతీయస్థాయిలో ఉన్నతమైన ఇంజనీరింగ్ కళాశాలలో సీటు వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తాను గేట్ మెకానిక్ లో మంచి ర్యాంకు సాధించి ఉద్యోగం పొందాలని లక్ష్యంగా ఉండేదని ,అయితే గేట్ ప్రొడక్షన్లో 45వ ర్యాంకు




రావడం పట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# భారీగా గంజాయి స్వాధీనం ముగ్గురు అరెస్ట్

**సిరి న్యూస్‌టుడే, కొత్తగూడెం:**

భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలో భారీ స్థాయిలో గంజాయి పట్టుకున్నారు. జూలూరుపాడు మండల కేంద్రంలో నిర్వహించిన తనిఖీల్లో సుమారు రూ.52 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వాహనాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో సుమారు 105.54 కిలోల గంజాయిని కార్లలో గుర్తించారు.జూలూరుపాడు పోలీసులు, సీసీఎస్ సిబ్బంది సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. వాహనాల్లో గంజాయి తరలుతోందన్న పక్కా సమాచారంతో జూలూరుపాడు శివారులో నిఘా పెట్టారు. కార్లలో సోదాలు చేయగా దాచి ఉంచిన 52 గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. కార్లలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కలిమెల, డొంకరాయి ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు వారు పోలీసులకు తెలిపారు. అరెస్టైన ముగ్గురిని నల్గొండ జిల్లాకు చెందిన శివాకర్ ప్రమోద్ కుమార్ (35), బైరెడ్డి భార్గవ్ (30), రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం నివాసి అందేకర్ శ్రీనివాస్ (40)లుగా గుర్తించారు. వీరిని అరెస్టు చేసిన పోలీసులు రెండు కార్లు, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అభి, లక్ష్మణ్, ఫరూక్ అనే ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు






# నిజామాబాద్ లో టెన్త్ పేపర్ లీక్

- **ఏడుగురు ఉపాధ్యాయులు సస్పెండ్**

**సిరి న్యూస్‌టుడే, నిజామాబాద్:**

పదో తరగతి పరీక్షల సమయంలో నిజామాబాద్ జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల నుండి ప్రశ్నపత్రాలు బయటకు రావడం సంచలనం సృష్టించింది. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైన పరీక్ష, మధ్యలో ఉండగానే సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. జిల్లాలోని ఆలూర్, మెండోరా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుండి ఈ లీకేజీ జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు ఏడుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు.

మధ్యాహ్నం 12:15 గంటల సమయంలో ఒక వాట్సాప్ గ్రూపులో తెలుగు ప్రశ్నపత్రాన్ని చూసి విద్యాశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. ప్రాథమిక విచారణ ప్రకారం, ఉపాధ్యాయులు తమకు తెలిసిన విద్యార్థులకు సహాయం చేసేందుకే ఈ పని చేసినట్లు తెలుస్తోంది. పేపర్లను బయట వ్యక్తులకు పంపి, వారి నుండి సమాధానాలు అడిగినట్లు గుర్తించారు. ఇందులో ఎటువంటి ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఆధారాలు లేవని డీఈఓ అశోక్ తెలిపారు.మండల విద్యాశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు నిజామాబాద్ పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు.

## విజయవాడ కార్పొరేషన్

# స్పెషల్ ఆఫీసర్ గా లక్ష్మీశా

**సిరి న్యూస్‌టుడే, విజయవాడ:**

విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా డా. జి. లక్ష్మీశా శుక్రవారం ఉదయం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని స్పెషల్ ఆఫీసర్ చాంబర్‌లో శుక్రవారం దుర్గగుడి ఆలయ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీఎంసీ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీఎంసీ స్పెషల్ ఆఫీసర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశా మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తనను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ నగరాన్ని సీఎం ఎప్పుడు గేట్ వే టు అమరావతిగా పేర్కొంటారని , అందుకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రజా సౌకర్యాలను విస్తరించడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.





# ముస్లిం సోదరులకు ఈద్ కా తోఫా

**సిరి న్యూస్‌టుడే, నాగారం:**

ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని ఘట్కేసర్ డివిజన్ నారాయణ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం సోదరులకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "ఈద్ కా తోఫా" రంజాన్ కానుకలను శుక్రవారం పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు.రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని, ఈ నేపథ్యంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్కేసర్ సర్కిల్, ఘట్కేసర్ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన కుటుంబాలకు రంజాన్ కానుకలను అందజేసినట్లు తెలిపారు. పండుగల సారాంశం పరస్పర సహకారం, సామరస్యం, సోదరభావమని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈద్ కా తోఫా పథకం ద్వారా పేద మరియు అర్హులైన ముస్లిం కుటుంబాలకు ఉపశమనం కలుగుతుందన్నారు. రంజాన్ మాసం ఆధ్యాత్మికత, నియమ నిష్ఠలకు ప్రతీక అని, ఈ పవిత్ర పండుగ సందర్భంగా ప్రతి కుటుంబం ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గంలో బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, ఘట్కేసర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్యాల యాదవ్, మాజీ ఛైర్మెన్ మల్లి పావని జంగయ్య యాదవ్, మాజీ కౌన్సిలర్లు మాజీ ప్రజా ప్రతినిధులు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# విద్యా రంగానికి కేటాయింపులపై ఉపాధ్యాయ సంఘాల ఆందోళన

**సిరి న్యూస్‌టుడే, ఆదిలాబాద్ బ్యూరో:**

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి సరైన ప్రాధాన్యం లభించలేదని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. పెండింగ్ బిల్లులు, పిఆర్‌సీ , ఐదు డీఏలు ఇంకా పరిష్కారం కాకపోవడం, వాటిపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం విచారకరమని పేర్కొన్నాయి.

ఇప్పటికే పిఆర్‌సీ అమలు 33 నెలలు ఆలస్యమైందని, ఆరు నెలల్లో అమలు చేస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోకపోవడాన్ని విమర్శించాయి.

ఉద్యోగుల ఆరోగ్య పథకానికి రూ.1056 కోట్లు కేటాయించడాన్ని స్వాగతించినప్పటికీ, ఆ నిధులు సక్రమంగా వినియోగం కావాలని సూచించాయి. అయితే ఉచిత పథకాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల విద్యారంగానికి తగిన కేటాయింపులు జరగలేదని అభిప్రాయపడ్డాయి.

2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ.3,24,234 కోట్ల బడ్జెట్‌లో విద్య, మానవ వనరుల కోసం కేవలం రూ.26,674 కోట్లు మాత్రమే కేటాయించారని, ఇది మొత్తం బడ్జెట్‌లో 8.2 శాతమేనని వెల్లడించాయి. మేనిఫెస్టోలో విద్యకు 15 శాతం కేటాయిస్తామని ఇచ్చిన హామీ వరుసగా మూడో బడ్జెట్‌లో కూడా నెరవేరలేదని పేర్కొన్నాయి.

ఉదయం అల్పాహారం, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించడం మంచి నిర్ణయమే అయినప్పటికీ, అదనంగా కేటాయించిన రూ.3,566 కోట్లు ఈ పథకాల అమలు, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ స్థాపన వంటి కార్యక్రమాలకు సరిపోకపోవచ్చని అభిప్రాయపడ్డాయి.



అలాగే పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల, మధ్యాహ్న భోజనం నాణ్యత పెంపు వంటి అంశాలకు అదనపు నిధుల కేటాయింపు లేకపోవడాన్ని విమర్శించాయి.

గత సంవత్సరం 7.58 శాతం కేటాయించగా, ఈసారి 8.22 శాతం మాత్రమే కేటాయించడం నిరాశ కలిగించిందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొన్నాయి.

ఈ విషయాలపై ప్రభుత్వం వెంటనే స్పందించి, విద్యారంగానికి తగిన ప్రాధాన్యం కల్పించాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి. నరసింహ స్వామి డిమాండ్ చేశారు.



# గోదావరి నదిలో అయిదుగురు విద్యార్థులు గల్లంతు

**సిరి న్యూస్‌టుడే, కొత్తగూడెం:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గోదావరి నదిలో స్నానానికి వెళ్లిన ఐదుగురు విద్యార్థులు నీటి ఉధృతికి కొట్టుకుపోయారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని అమరావతిలో ఉన్న ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఏడుగురు విద్యార్థుల బృందం సెలవుల నేపథ్యంలో భద్రాచలం పర్యటనకు వచ్చారు. భద్రాచలం కూనవరం రహదారిలోని కొల్లుగూడెం ఇసుక ర్యాంపు ప్రాంతంలో గోదావరి నది అందాలను చూసేందుకు వారు వెళ్లారు. ఈ క్రమంలో ఈత కొట్టేందుకు నదిలోకి దిగారు. అయితే.. నీటి లోతును సరిగ్గా అంచనా వేయలేకపోవడం, ప్రవాహ వేగం అకస్మాత్తుగా పెరగడంతో విద్యార్థులు నీటిలో మునిగిపోయారు. గట్టుపై ఉన్న మిగిలిన ఇద్దరు విద్యార్థులు గట్టిగా కేకలు వేయడంతో చేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నాగ కుమారి కి ఉగాది పురస్కారం

**సిరి న్యూస్‌టుడే, విజయవాడ :**




శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేసే ఉగాది పురస్కారాల కార్యక్రమం ఘనంగా జరిగింది. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని వివిధ రంగాలలో విశేష సేవలు అందించిన ప్రతిభావంతులను సత్కరించారు. ఈ సందర్భంగా సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన డాక్టర్ బొమ్మదేవర నాగ కుమారి కి ఉగాది పురస్కారం అందజేశారు. ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం తమకు గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. సాహిత్య సేవల ద్వారా సమాజానికి విలువైన సందేశాలను అందిస్తున్న ఆమెకు ఈ అవార్డు దక్కడం పట్ల సాహిత్య వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



# బోధన్ లో పట్ట పగలు చోరీ

**సిరి న్యూస్‌టుడే, బోధన్:**

నిజామాబాద్ జిల్లాలోని బోధన్ పట్టణంలో ఒక భారీ చోరీ జరిగింది. స్థానిక గోశాల సమీపంలో నిలిపి ఉంచిన ఒక కారును టార్గెట్ చేసిన దొంగలు, కారు అద్దాలను చాకచక్యంగా పగలగొట్టి, అందులో సుమారు 3 లక్షల రూపాయల నగదును ఎత్తుకెళ్లారు. జనం రద్దీగా ఉండే ప్రాంతంలో, అందరూ చూస్తుండగానే ఈ ఘటన జరగడం గమనార్హం. దొంగలు బాధితుడి కదలికలపై ముందే నిఘా ఉంచి, అదును చూసి ఈ దోపిడీకి పాల్పడినట్లు తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, సీఐ వెంకట నారాయణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, ఆధారాల కోసం పరిసరాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని సేకరిస్తున్నారు. ఈ చోరీకి పాల్పడింది అంతర్రాష్ట్ర ముఠా అయి ఉంటుందా లేదా స్థానిక నేరస్తులా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.



# వైభవంగా దేవాలయ వార్షికోత్సవం

**సిరి న్యూస్‌టుడే, నాగారం:**

మేడ్చల్ నియోజకవర్గం ఘట్కేసర్ సర్కిల్, పోచారం డివిజన్ పరిధిలోని ప్రతాపసింగారంలో శుక్రవారం నిర్వహించిన శ్రీశ్రీ గుబ్బరి గట్టు మైసమ్మ, ఎల్లమ్మ దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం కార్యక్రమం వైభవంగా జరిగింది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో వారు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రాంత ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# హార్ట్.. ఎటాక్


## కలవరపెడుతున్న గుండె మరణాలు కారణాలు ఇవేనా..?

**గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఆకస్మిక గుండెపోటు మరణాల సంఖ్య పెరిగిపోతుంది. ముందస్తు లక్షణాలు లేకుండా, వయస్సుతో సంబంధం లేకుండా, మరణిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. క్రికెట్ ఆడుతూ, డ్యాన్స్‌చేస్తూ, స్పీచ్ ఇస్తూ నేలరాలి పోతున్నారు. అస్సలు ఎందుకిలా అవుతుందనేది ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్నగా మారింది. దీనిపై కొంత మంది వైద్యనిపుణులు కొన్ని కారణాలను అంచానా వేస్తున్నారు. ఇవేంటో తెలుసుకుందాం..**

గతంలో గుండెపోటు అంటే ఓ వయసు దాటినవారికే వచ్చేదని అందరికీ తెలుసు. అది కూడా బీపీ, షుగర్, చెడు వ్యసనాలు ఉన్నవారికే వచ్చేదని అనుకునేవాళ్లం. కానీ.. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా చిన్నారులను కూడా బలి తీసుకుంటోంది. పదేళ్ల వయసున్న ఓ నాలుగో తరగతి చిన్నారి హర్ట్ ఎటాక్‌తో మరణించటం ఆలోచించదగ్గ విషమేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే.. సాధారణంగా గుండెపోటు వచ్చే ముందు ఛాతిలో విపరీతమైన నొప్పి, గుండెల్లో, గొంతులో మంట, కొంతదూరం నడిచినా ఆయాసం రావడం, ఎడమ చేయి బాగా లాగడం వంటి లక్షణాలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే 40 శాతం మందిలో ఈ లక్షణాలేమీ లేకుండానే గుండెపోటుకు గురవుతున్నారన్నారు. 15 శాతం మంది మాత్రం జన్యుపరమైన సమస్యలతో గుండెపోటుకు గురవుతున్నారు.

దీనికి కారణం.. నేటి ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ కాలంతో పరుగులు పెట్టడమేనని నిపుణులంటున్నారు. పని ఒత్తిడితో సమయానికి తిండి, నిద్ర లేక సతమతమవుతున్నారు. చదువు, ఉద్యోగం, కుటుంబ బాధ్యతల నడుమ అనేక రకాల మానసిక ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారు. బిజీ లైఫ్‌లో ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడి పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. అదే సమయంలో శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు పెరిగి అనేక రుగ్మతలు కొని తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక సమస్యలతో పాటు గుండెపోటుకు గురవుతున్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్తులో గుండెపోటు మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

గుండెపోటు మరణాల నుండి రక్షించుకోవడానికి హెల్తీ లైఫ్ స్టైల్ ను అలవరుచుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. యంగ్‌గా ఉన్నప్పుడే శరీరానికి ఓ హెల్తీ రొటీన్‌ని అలవాటు చేయాలి. దానిలో భాగంగా వ్యాయామాన్ని చేర్చుకోవాలి. జిమ్‌కి వెళ్లడం, డ్యాన్స్, రన్నింగ్ వంటివి డైలీ రొటీన్‌లో భాగమైతే గుండె స్ట్రాంగ్‌గా మారడంతో పాటు మీరు హెల్తీగా ఉంటారు. బయట ఫుడ్ కొనుక్కునే డబ్బులతో హెల్తీగా ఫ్రూట్స్, కూరగాయలను కొనుక్కోవచ్చు. వీటిని మీ డైట్‌లో చేర్చుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి. రెగ్యులర్‌గా మెడికల్ టెస్ట్‌లు చేయించుకుంటే ప్రమాద కారకాలను ముందే గుర్తించి ట్రీట్‌మెంట్ తీసుకోవచ్చని ఈ గుండె సమస్యలకు చెక్ పెట్టొచ్చని సూచిస్తున్నారు.





# OpenAI

# జీబ్లీ హవా..

## రిస్క్‌లో యూజర్ డేటా..! బీ అలర్ట్.. ఈ ట్రెండ్ వెనుక ఓ చీకటి కోణం?

గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో మనుషులు అందరూ బొమ్మలా మారిపోతున్నారు. ఇప్పుడు ఇదే ట్రెండ్ వైరల్ అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్.. ఇప్పుడు ఏ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ ఓపెన్ చేసినా ఫీడ్ మొత్తం జీబ్లీ ఫొటోలతో నిండిపోతోంది. అయితే ఈ ట్రెండ్ వెనుక ఓ చీకటి కోణం ఉందని నిపుణులు చెబుతున్నారు. యూజర్లు జీబ్లీ ఆర్ట్ కోసం ఏఐ కంపెనీలకు షేర్ చేసిన సమాచారం గోప్యతకు భంగం కలుగుతోందని హెచ్చరిస్తున్నారు.

ఈ జీబ్లీని ఓపెన్ ఏఐ సంస్థ ఇటీవల చాట్ జీపీటీలో ప్రవేశపెట్టింది. ఈ ఆప్షన్‌ను నెటిజన్లు తెగ వాడేస్తున్నారు. ఓపెన్ ఏఐ సహాయంతో కార్టూన్ తరహా ఫొటోలను నెటిజెన్లు క్రియేట్ చేసుకుని, సోషల్ మీడియాలో షేర్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే చాట్‌జీపీటీకి యూజర్ల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. కేవలం ఒక గంటలో మిలియన్ యూజర్లు యాడ్ అయ్యారని ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్‌ట్‌మన్ వెల్లడించారు.

అయితే.. చాలా ఏఐ ప్లాట్‌ఫామ్‌లు ఇలాంటి ఆర్ట్‌ను క్రియేట్ చేస్తున్నాయి. కానీ అందులో కొన్ని కంపెనీలు మాత్రమే తాము ఫొటోలను స్టోర్ చేయమని, ఒకసారి ఉపయోగించిన తర్వాత వాటిని డిలీట్ చేస్తామని చెబుతున్నాయి. ఇలా చెబుతున్న చాలా కంపెనీల్లో అసలు డిలీట్ పాక్షికంగా చేస్తారా..? వెంటనే చేస్తారా..? ఆలస్యం అవుతుందా అనే విషయాలపై స్పష్టత ఇవ్వడం లేదు. ఇలా ఏఐ యాప్‌లతో వ్యక్తిగత ఫొటోలను పంచుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు యూజర్లకు సూచిస్తున్నారు.

అలాగే.. ఇలా కొత్త సాఫ్ట్ వేర్‌లను ఉపయోగించేముందు దాని కండీషన్లు, గోప్యతా విధానాలను చదివి ధృవీకరించాలంటున్నారు. ప్రామాణిక ఆడిట్‌లను తప్పనిసరి చేయాలని నిపుణులు చెబుతున్నారు. చాలా ప్లాట్‌ఫారమ్‌లు డేటా వినియోగ నిబంధనలు చాలా పెద్దగా ఉంటాయి. అవి చాలా ఉండటం వల్ల చాలా మంది దాన్ని అర్థం చేసుకోలేరు. తెలియకుండానే ఆ నిబంధనలన్నింటికీ ఓకే చెబుతారు. ఇలా చేయడం ద్వారా సైలెన్స్‌గా బ్యాక్‌గ్రౌండ్‌లో డేటాను సేకరిస్తాయని యాంటీ వైరస్ సర్వీసెస్ సంస్థ మెక్‌అఫీ సీనియర్ డైరెక్టర్ ఆఫ్ ఇంజనీరింగ్ ముఖర్జీ హెచ్చరించారు.

ఒకవేళ యూజర్ ఫోన్‌లోకి వైరస్ చేరి ఈ ఏఐ సర్వీస్‌ను యాక్సెస్ చేయడానికి ఉపయోగించే ఖాతా బ్రీచ్ అయితే డేటా చోరీ జరిగే అవకాశం ఉందని వెల్లడించారు. ఇదే కాకుండా ఇంకో విధంగా మన డేటా లీక్ కావొచ్చు. ఏఐలో సాంకేతిక సమస్యలు లేదా హానికరమైన కార్యకలాపాల కారణంగా, డేటా లీక్ కావచ్చు. లీకైన డేటా పబ్లిక్‌లేదా ప్రత్యేక వెబ్‌సైట్‌లలో అమ్మకానికి ఉండవచ్చునీ నిపుణులు చెబుతున్నారు.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADaHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.